

భైంసా దగ్గరలో జరిగిన సభలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

# టీఆర్ఎస్‌కు పోలీసుల చెంచాగిరి

## తీరు మార్చుకోవాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వార్నింగ్

**భైంసా, వెలుగు:**

రాష్ట్రంలో పోలీసులు టీఆర్ఎస్‌కు చెంచాగిరి చేస్తున్నారని, ప్రవర్తన మార్చుకోవాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హెచ్చరించారు. సీఎం కేసీఆర్ ఆదేశాలతో పోలీసులు తప్పులు చేస్తున్నారని, రాజకీయ పార్టీలను అణిచివేసే దోరణితో వ్యవహరిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ శాశ్వతం కాదని, ఆయన పతనం మొదలైందని అన్నారు. వెయ్యి మంది కేసీఆర్‌లు, ఒవైసీలు ఒక్కటైనా ప్రధాని మోడీని అడ్డుకోలేరని చెప్పారు. కేంద్రంలో మరోసారి మోడీ సర్కారు అధికారంలోకి రాబోతోందన్నారు. దుష్ట పాలనను తరిమికొట్టేందుకు జైలుకు వెళ్లడానికయినా సిద్ధమేనని అన్నారు. ప్రజా సంగ్రామ యాత్రలో భాగంగా మంగళవారం నిర్మల్ జిల్లా భైంసాలో జరిగిన సభలో కిషన్ రెడ్డి మాట్లాడారు.

- కేసీఆర్ పతనం షురువైందని కామెంట్
- ప్రజాధనం దోసుడు, అపొజిషన్‌ను అణుచుడే సీఎం ఎజెండా

**కేసీఆర్‌కు ఎవరిపైనా గౌరవం లేదు**

రాష్ట్రంలో ప్రతీ 50 మందికి ఒక బెల్టు షాపు నడుస్తోందని కిషన్ రెడ్డి ఆరోపించారు. కేసీఆర్‌కు ప్రధానిపై, గవర్నర్‌పై గౌరవం లేదని, ఉద్యమాలను కూడా ఆయన గౌరవించరని అన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్షాలను అణిచివేసుడు, ప్రజాధనాన్ని దోచుకునుడే ఆయన ఎజెండాగా పెట్టుకున్నారని మండిపడ్డారు. హుజూరాబాద్ ఎన్నికల్లో గెలిచేందుకే దళిత బంధు తెచ్చారని, ఆ స్కీమ్ లబ్ధిదారులంతా ఈటల రాజేందర్ ఫొటో పెట్టుకోవాలని సూచించారు. బీసీ బంధు, గిరిజన బంధు ఎందుకు అమలు చేయట్లేదని ప్రశ్నించారు. సైనిక్ స్కూల్, సైన్స్‌సిటీ, ఎంఎంటీఎస్ లాంటి పథకాలను పక్కన పెట్టిన కేసీఆర్ తన కుటుంబ సంక్షేమం కోసం ధరణిని ప్రవేశ పెట్టి భూముల కబ్జాలకు తెగబడుతున్నారని ఆరోపించారు. తన అవినీతి అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఎదురు దాడి చేస్తున్నాడని మండిపడ్డారు. టీఆర్ఎస్ పార్టీ ప్రజల రక్తం తాగుతోందని, డబ్బులతో రాజకీయాలు చేస్తామని భ్రమపడుతున్నారని అన్నారు. కేసీఆర్‌పై వ్యక్తిగత పోరాటం కాదని, అవినీతి, అక్రమ, కుటుంబ పాలనకు వ్యతిరేకంగా పోరాటం సాగుతుందన్నారు.

**సర్కారు బడులను పట్టించుకుంటలే: ఈటల**

రాష్ట్రంలో ఏ ఇంటి తలుపు తట్టినా కేసీఆర్ ఓటమి ఖాయమంటున్నారని, ఆయన ప్రజల సమస్యలను గాలికి వదిలేసి ప్రగతి భవన్, ఫాంహౌస్‌కే పరిమితం అయ్యారని ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. సర్కారు బడుల్లోని పిల్లలకు సరైన భోజనం అందించట్లేదని, పిల్లలు రోగాల పాలవుతున్నా పట్టించుకోవట్లేదని మండిపడ్డారు. బాసర ట్రిపుల్ ఐటీలో చదువు, తిండి కోసం పిల్లలు ఉద్యమాలు చేయాల్సివచ్చిందన్నారు. మీ మనవడికి మాదిరిగా విద్యాసంస్థల్లో పిల్లలకు ఎందుకు తిండి పెట్టట్లేదని కేసీఆర్‌ను ప్రశ్నించారు. రాష్ట్రంలో రైతుల సంక్షేమాన్ని కేసీఆర్ విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. సభలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, యాత్ర ప్రముఖ్ గంగిడి మనోహర్ రెడ్డి, ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి, మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి, మాజీ ఎంపీలు రాథోడ్ రమేశ్, బూర నర్సయ్య గౌడ్, పార్టీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోహన్‌రావు పటేల్, తదితరులు పాల్గొన్నారు.

### ఐదు గంటలకే సభ ముగింపు

హైకోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా సంజయ్ తన ప్రసంగాన్ని సాయంత్రం 4.59 గంటలకే ముగించారు. సాయంత్రం 4.45 గంటలకు స్పీచ్ ప్రారంభించిన ఆయన.. 14 నిమిషాల పాటు ఉద్వేగభరితంగా మాట్లాడారు. కోర్టులంటే తమకు గౌరవం ఉందని, అందుకే కోర్టు ఆదేశాల ప్రకారం ఐదు గంటలలోపే సభను ముగిస్తున్నట్లు తెలిపారు. నిర్దేశించిన సమయానికి ఒక నిమిషం ముందు స్పీచ్ ను ముగించారు.

### కొడుకుకు మోడీ పేరు పెట్టిన అభిమాని

ప్రధాని మోడీ అభిమాని ఎడ్ల మహేశ్ దంపతులు తమ కొడుకుకు విశ్వేశ్ నరేంద్రమోడీగా నామకరణం చేశారు. పాదయాత్రలో భాగంగా బండి సంజయ్ భైంసా సమీపంలోని కమలాపూర్ గుట్ట వద్ద బస చేశారు. మంగళవారం మహేశ్ అక్కడికి వచ్చి తమ 3 నెలల కొడుకుకు మోడీ పేరు వచ్చేలా నామకరణం చేయాలని సంజయ్‌ను కోరారు. దీంతో విశ్వేశ్ నరేంద్ర మోడీ అని సంజయ్ సూచించారు. మోడీ అంటే తమకు ఎంతో ఇష్టమని, ఇంకో 20 ఏండ్లు ఆయనే దేశాన్ని పాలించాలని, రాష్ట్రంలో నూ బీజేపీ ప్రభుత్వం ఏర్పడాలని మహేశ్ దంపతులు ఆకాంక్షించారు.

ఈనాడు
epaper.eenadu.net

# భైంసాను దత్తత తీసుకుంటా

- ఎన్నికలెప్పుడొచ్చినా కాషాయ జెండాదే గెలుపు
- భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్
- కేసీఆర్ అవినీతి, కుటుంబ పాలనకు వ్యతిరేకంగానే పోరాటం: కిషన్‌రెడ్డి

ఈటీవీ, ఆదిలాబాద్: "ఎన్నికలు ఎప్పుడొచ్చినా కాషాయ జెండా ఎగరడం ఖాయం. ప్రభుత్వం ఏర్పడగానే భైంసాను దత్తత తీసుకోవడమే కాదు.. 'మైసా'గా పేరు మారుస్తాం" అని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. రాష్ట్రాన్ని రూ.5 లక్షల కోట్ల అప్పుల్లో ముంచిన కేసీఆర్‌కు మూడిందంటూ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. పుట్టబోయే ప్రతి బిడ్డపై రూ.లక్ష అప్పు భారం పడుతోందని, అందుకే తెరాస ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించామని చెప్పారు. ప్రజల ఆశీస్సులతో భాజపా విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. హైకోర్టు షరతుల మేరకు భైంసాకు 5 కి.మీ. దూరంలో ఉన్న ఓ జిన్నింగ్ పరిశ్రమ ఆవరణలో మంగళవారం నిర్వహించిన బహిరంగసభలో ఆయన ప్రసంగించారు. "హైకోర్టు సూచనలకు అనుగుణంగానే సభ నిర్వహిస్తున్నాం. పార్టీ తరఫున 3 వేల మందికే సమాచారం అందించాం. భాజపా చట్టాన్ని గౌరవించే పార్టీ. ఎంఐఎంలా ఉల్లంఘించేది కాదు. మత విద్వేషాలను రగిలించిన పచ్చజెండా పార్టీ వాళ్లకు భయపడే ప్రసక్తే లేదు. భైంసా లాంటి ప్రాంతానికి రావడానికి వీసా తీసుకోవాలా? అదేమైనా పాకిస్థాన్, అఫ్గానిస్థాన్, బంగ్లాదేశ్‌లో ఉందా? భైంసాలో బహిరంగ సభ ఉందని 144 సెక్షన్ పెట్టినట్లు తెలిసింది.

...మిగతా 3లో



భైంసా పట్టణ సమీపంలో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతున్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్. చిత్రంలో మర్రి శశిధర్‌రెడ్డి, ఎంపీ సోయం బాపురావు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే ఈటల రాజేందర్, ఇంద్రసేనారెడ్డి తదితరులు

Date : 30/11/2022 EditionName : TELANGANA PageNo :

ఈనాడు
epaper.eenadu.net

# భైంసాను దత్తత తీసుకుంటా

(మొదటి పేజీ తరువాయి)

రెండు సెక్షన్లు అదనంగా పెట్టినా ఇక్కడి ప్రజలు భయపడరు. ఎంఐఎం సభలకు ప్రభుత్వం ఎలాంటి షరతులు విధించదు. భాజపా సభను అడ్డుకోవడానికి కుట్రలు చేశారు. సంక్రాంతి పండగను సైతం చేసుకోనీయకుండా భయపెట్టిన అల్లరిమూకలను అడ్డుకోవడంలో హిందూవాహిని కార్యకర్తలు చూపిన తెగువ అమోఘం. భాజపా ప్రభుత్వం ఏర్పడగానే భైంసాలో మా కార్యకర్తలపై నమోదైన పీడీ యాక్టులను ఎత్తివేస్తాం. పక్కా ఉద్యోగాలు కల్పిస్తాం. ఉచిత విద్య, వైద్యంతోపాటు నిలువనీడ లేని పేదలందరికీ పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తాం.

కడెం ప్రాజెక్టుకు అతీగతీ లేదు. బాసర ఆర్జీయూకేటీలో చుట్టపోళ్ల కాంట్రాక్టర్లను కాపాడేందుకు విద్యార్థులపై ర్యాగింగ్ నెపం మోపారు. న్యాయం, ధర్మం, సంస్కృతికి పాటుపడే భాజపా నేతలపై ఆంక్షలను విధించే ప్రభుత్వం మనకు కావాలా? నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వకుండా మొండిచేయి చూపింది. ఇచ్చిన మాటకు అనుగుణంగా నరేంద్ర మోదీ ప్రభుత్వం 75 వేల మందితోపాటు ఇటీవల మరో 71 వేల మందికి ఉద్యోగాలిచ్చింది" అని సంజయ్ అన్నారు.

## వంద మంది కేసీఆర్‌లు వచ్చినా మోదీని ఓడించలేరు: కిషన్‌రెడ్డి

వంద మంది కేసీఆర్లు, వంద టీఆర్‌ఎస్‌లు, మరో వంద ఎంఐఎంలు వచ్చినా నరేంద్ర మోదీని ఓడించలేరని.. 2024లో మూడోసారి కేంద్రంలో భాజపా అధికారంలోకి రావడం ఖాయమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. అధికారంలోకి రాగానే కేసీఆర్ కుంభకోణాల స్నింటినీ వెలికితీసి అవినీతి సొమ్మును ప్రజలకు పంచుతామని చెప్పారు. భైంసా బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యంగా విమర్శలు గుప్పించారు. "దేశ ప్రధాని, గవర్నర్, చివరికి రాజకీయ పార్టీలన్నా సీఎంకు గౌరవం లేదు. పోలీసులు తెరాస ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారు. కేసీఆర్ అంటే మాకు వ్యక్తిగత ద్వేషం లేదు. ఆయన అవినీతి, నియంత, కుటుంబ పాలనకు వ్యతిరేకంగానే పోరాడుతున్నాం. కేసులు పెట్టి భయపెట్టేందుకు ప్రయత్నించినా వెనకడుగు వేసే ప్రసక్తి లేదు. భాజపా శ్రేణులను అరెస్టు చేస్తే జైళ్లు సరిపోవు" అని కిషన్‌రెడ్డి అన్నారు.



సభకు హాజరైన జనం

హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ మాట్లాడుతూ నియంతలా వ్యవహరిస్తున్న వారిలో కేసీఆర్ మొదటి వ్యక్తి కాదని, చివరి వ్యక్తీ కాదని అన్నారు. ఎమర్జెన్సీ విధించి దేశ ప్రజలను జైళ్లలోకి నెట్టిన ఇందిరా గాంధీ ప్రభుత్వమే మట్టిలో కలిసిపోయిందని, కేసీఆర్ అంత కంటే గొప్పనా అని ప్రశ్నించారు. బహిరంగ సభలో ఎంపీ సోయం బాపురావు, నేతలు మర్రి శశిధర్ రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, ప్రేమేందర్‌రెడ్డి, రమేష్ రాథోడ్, గంగిడి మనోహర్‌రెడ్డి, టి.వీరేందర్‌గౌడ్, రమాదేవి, రామారావు పటేల్ తదితరులు పాల్గొన్నారు. బహిరంగ సభ ముగిసిన అనంతరం శ్రేణుల సందోహం మధ్య సంజయ్ పాదయాత్ర ప్రారంభమైంది. భైంసా మండలం గుండెగావ్ సమీపంలో ఏర్పాటు చేసిన శిబిరం వరకు కొనసాగింది.

Date : 30/11/2022 EditionName : TELANGANA PageNo :

ఆంధ్రప్రభ

# అప్పులు.. మద్యం!

- తెలంగాణను మార్చేశారు
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆరోపణలు



**నిర్మల్ ప్రతినిధి/భైంసా/భైంసా రూరల్, ప్రభన్యూస్:** తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని చెబుతున్న సీఎం కేసీఆర్ తెలం గాణను అప్పుల తెలంగాణగా, మద్యం తెలంగాణకు మార్చేసి ప్రజలపై పెను భారం మోపుతున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం భైంసా పట్టణంలో ఏర్పాటు చేసిన బహిరంగసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఒక్కో గ్రామంలో 30 బెల్టుషాపులు ఉన్నాయని ఇది కేసీఆర్ సాధించిన ఘనతేనని ఆయన ఎద్దేవా చేశారు. కేసీఆర్‌కు ప్రధాని, గవర్నర్, రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులపై ఏ మాత్రం గౌరవం లేదన్నారు. గత నాలుగు విడతలుగా చేపట్టిన పాదయాత్రకు అడ్డంకులు సృష్టిస్తున్నారని, అయినా ధర్మం మా వైపు ఉందని కాబట్టి పాదయాత్ర చేయడం జరుగుతుందన్నారు. ఆడబిడ్డ అని కూడా చూడకుండా వైఎస్ షర్మిల వాహనాన్ని టీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు తగులబెట్టారని, మరి పోలీసులు ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. యాత్రను అడ్డుకుంటూ అక్రమ కేసులు పెడుతున్నారని ఆవేదన వ్యకర్తం చేశారు. కేసీఆర్ ఆదేశాలతో టీఆర్ఎస్ పార్టీ ఏజెంట్స్‌గా పోలీసులు వ్యవహరిస్తున్నారని అన్నారు. తెలంగాణలో కేసీఆర్ పతనం ప్రారంభమైందని, ఎవరు శాశ్వతం కాదని, 2024లో పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా కేసీఆర్‌కు రాదని, టీఆర్ఎస్ పార్టీ పెట్టి నరేంద్రమోడీని కేసీఆర్ అడ్డుకుంటాడా అని ప్రశ్నించారు. వేయి మంది కేసీఆర్‌లు, అసదుద్దీన్ ఓవైసీలువచ్చినా నరేంద్రమోడీని అడ్డుకోలేరని సవాల్ చేశారు. కేసీఆర్ చేసిన అనేక అవినీతి, కుంభకోణాల మీద తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ప్రతీ అవినీతిపై దర్యాప్తు చేస్తామన్నారు. ఆయుష్మాన్ భారత్ ఎందుకు అమలు చేయడం లేదని, ఇసుక, గ్రానైట్ సున్నపు క్వారీ, భూములు అన్ని కేసీఆర్ ప్రతిపక్షాలను అనచడం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో భూమాఫియా విచ్చలవిడిగా చెలరేగిందని, కేసీఆర్ అస్తవ్యస్త పాలన కారణంగా రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం వచ్చే పరిస్థితి వచ్చిందన్నారు. కేసీర్ కుటుంబంపై బీజేపీ యుద్ధం ప్రకటించిందని, ప్రజలకు నీతివంతమైన పాలన ఇచ్చేందుకు బీజేపీ పోరాడుతోందన్నారు.

## బాసర విద్యార్థులకు హ్యాట్సాఫ్..: ఈటల

సీఎం కేసీఆర్ పాలనలో చదువులమ్మ ఒడి అయిన బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థులు తమ హక్కుల కోసం ఉద్యమాన్ని చేశారని, విద్యార్థుల ఉద్యమంతో కేటీఆర్ దిగివచ్చాడని హుజూరాబాద్ ఎమ్మెల్యే, బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు ఈటల రాజేందర్ పేర్కొన్నారు. మంగళవారం భైంసాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ రెసిడెన్షియల్ స్కూల్‌లో మంచి భోజనం పెట్టకపోవడంతో బల్లులు పడిన అన్నం తిని విద్యార్థులు అనారోగ్యం పాలై ఆస్పత్రికి వెళ్తున్న పరిస్థితి దాపురించిందని ఆరోపించారు. కేసీఆర్‌ను ఓడగొట్టడమే మా ఎజెండా అని ప్రజలు అనుకుంటున్నారని అన్నారు. కేసీఆర్ మాటలు కోటలు దాటుతున్నాయని, చేతలు మాత్రం గుమ్మం కూడా దాటడం లేదని ఎద్దేవా చేశారు. కేసీఆర్ డైరెక్షన్‌లో పోలీసులు ఎంత మంది బీజేపీ కార్యకర్తలపై కేసులు పెడుతారని ప్రశ్నించారు. తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని ఆయన స్పష్టం చేశారు. రాబోయే కాలంలో పులిబిడ్డల్లా ఆదిలాబాద్ ప్రజలు బీజేపీ గెలుపు కోసం ప్రయత్నం చేయాలని కోరారు.

## పాదయాత్రను అడ్డుకోలేరు..: ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు

ప్రజల కష్టాలను తెలుసుకునేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ప్రజాసంగ్రామ ఐదో విడత పాద యాత్రను అడ్డుకునేందుకు కేసీఆర్ ఎన్నో కుయుక్తులు పన్నారని, కానీ ధర్మం ముందు అధర్మం నిలువదని అందుకే కోర్టు తమకు పాదయాత్రకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపు రావు పేర్కొన్నారు.

ప్రజాక్షేత్రంలో అందరికి భావాస్వేచ్ఛ హక్కు ఉంటుందని, ఆ హక్కులను హరించేందుకు కేసీఆర్ పోలీసులను అడ్డం పెట్టుకుని బీజేపీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తూ భయాందోళనను సృష్టిస్తున్నారని గుర్తు చేశారు. ఎక్కడ తన తప్పులను పాదయాత్రలో లేవనెత్తుతారో అనే భయంతోనే ఈ అడ్డంకులు సృష్టిస్తున్నారని భైంసా బహిరంగసభలో ఆయన ఎద్దేవా చేశారు.

Date: 30/11/2022, Edition: Telangana , Page: 2
Source : https://epaper.prabhanews.com/